చి'వరి'కి కాళేశ్వరం ప్రాజెక్టే ఆధారం

- ఎస్సారెస్పీ ద్వారా టేల్యాండ్ ప్రాంతాలకు సరిపడా అందని నీరు
- ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నంది పంప్‌హౌస్ ద్వారా నీటి ఎత్తిపోత
- రెండు రోజుల పాటు 0.54 టీఎంసీ నీటి పంపింగ్
- 229.30 మీటర్ల నీటి మట్టంతో నంది రిజర్వాయర్‌కు జలకళ

నీటితో కళ కళ లాడుతున్న నంది రిజర్వాయర్

ధర్మారం, మార్చి 31: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో యాసంగిలో సాగు చేసి చివరి దశలో ఉన్న వరి పంటల సంరక్షణకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వర ప్రాజెక్ట్ నిర్మాణాలే ఆధారమయ్యాయి. ఎస్సారెస్పీ కాలువలో వస్తున్న నీటికి తోడు రెండు రోజుల పాటు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్మాణాల ద్వారానే నీటి ఎత్తిపోతలు చేపట్టింది. కాళేశ్వరం నిర్మాణంలో ఎంతో అవినీతి జరిగిందంటూ ప్రాజెక్ట్‌నే తప్పుపట్టి దుష్ప్రచారం చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. చివరకు పంటల రక్షణకు మళ్లీ కాళేశ్వరం నిర్మాణాలపైనే ఆధారపడి నీటి ఎత్తిపోతను చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అనుబంధంగా 6వ ప్యాకేజీ కింది నంది పంప్‌హౌస్, 7వ ప్యాకేజీకి అనుబంధంగా నంది గ్రామంలో పెద్ద చెరువును విస్తరించి రిజర్వాయర్, అండర్ టన్నెల్, 8వ ప్యాకేజీకి అనుబంధంగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్, మల్యాల మండలం ర్యాలపల్లి వరకు ఉన్న వరద కాలువ ద్వారా సరఫరాకు వరద కాలువకు రెండు రోజుల పాటు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటి ఎత్తిపోతకు ఆధారంగా ఏర్పడింది.

వివరాలోకి వెళ్తే.. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నీటి మట్టం 20 టీఎంసీల వరకు ఉండగా, అట్టి ప్రాజెక్ట్ నుంచి వారబంధి పద్ధతి ప్రకారం నీటి సరఫరా గడువు ఏప్రిల్ 2తో ముగుస్తుంది. ప్రాజెక్ట్‌లో నీటి మట్టం తగ్గుతున్న నేపథ్యంలో ఈ కాలువకు టేలాండ్‌గా ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో యాసంగి సీజన్‌లో సాగు చేసి చివరి దశలో ఉన్న వరి పంటలకు సరిపడేంత నీరు కాలువల్లో సరఫరా కావడం లేదు. కాకతీయ కాలువకు 3,400 క్యూసెక్కుల నీటి సరఫరా జరగాల్సి ఉండగా, కేవలం 2,400 క్యూసెక్కుల నీరు మాత్రమే ఎస్సారెస్పీ నీరు సరఫరా అవుతున్నది. దీంతో సక్రమంగా పంటలకు ఎస్సారెస్పీ నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ప్రస్తుతం వస్తున్న ఎస్సారెస్పీ నీటికి తోడు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం నుంచి నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా సాగు నీటిని కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2కు అనుబంధంగా ఉన్న పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్‌హౌస్‌లో 2వ మోటార్‌ను ఆన్ చేసి ఈ నెల 29 నుంచి 31 వరకు 3,150 క్యూసెక్కుల చొప్పున నంది రిజర్వాయర్‌లోకి డెలివరి సిస్టర్న్ ద్వారా ఎత్తిపోశారు. రెండు రోజుల పాటు 0.54 టీఎంసీ నీటిని నంది రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేయించారు. సోమవారం ఉదయం 8 గంటల వరకు నంది పంప్‌హౌస్‌లో మోటార్‌ను ఆఫ్ చేసి ఎత్తిపోతను నిలిపి వేశారు. నంది రిజర్వాయర్ నీటి మట్టం 233 మీటర్లు కాగా, 229.50 నీటి మట్టం వరకు నీటి నిల్వను ఉంచి ఎగువ ప్రాంతానికి నీటి ఎత్తిపోతను కొనసాగించారు. కాగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసిన నీటిని రెండు రోజులపాటు నీటిని కరీనంగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని బాహుబలి మోటార్లను ఆన్‌చేసి మిడ్‌మానేర్‌కు వెళ్లకుండా గేట్లు మూసివేసి వరద కాలువకు మళ్లించారు. మల్యాల మండలం ర్యాలపల్లి వద్ద వరద కాలువకు అనుబంధంగా ఉన్న లింక్ కాలువ ద్వారా కాకతీయ కాలువలోకి వదిలారు. ఎస్సారెస్పీ కాలువ వస్తున్న నీటికి వరద కాలువ నీరు తోడై ఈ కాలువలో 3,400 క్యూసెక్కుల నీటి పరిమాణంతో పెరగడంతో చొప్పదండి మండలం రేవెళ్లే వద్ద పెద్దపల్లి జిల్లాలోని పెద్దపలి, మంథని ప్రాంతాలకు వెళ్లే ఎస్సారెస్పీ కాల్వ డీ-83, చొప్పదండి నుంచి సుల్తానాబాద్, శ్రీరాంపూర్, ఓదెల ప్రాంతాలకు వెళ్లే డి-86 కాల్వతో పాటు కరీంనగర్ రూరల్ మండలం రేకుర్తి వరకు ఉన్న కాకతీయ అనుబంధ కాలువలు డీ-94 వరకు నీటి సరఫరా చేశారు. ఎస్సారెస్పీ కాలువ నీటికి తోడు ప్రత్యేకంగా రెండు రోజుల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి పంపింగ్ చేయడంతో కాల్వలో సామర్థ్యం వరకు నీటి సరఫరా చేశారు. కాగా గాయత్రీ పంప్‌హౌస్ మోటార్‌ను నిలిపి వేయడంతో ప్రస్తుతం నంది రిజర్వాయర్‌లో 229.30 వరకు నీటి మట్టం ఉండడంతో రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకున్నది. జలాశయం చూపరులను ఎంతో ఆకర్శిస్తున్నది. ఇంకా పొట్ట దశలో ఉన్న వరి పంటలకు మళ్లీ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని ఎత్తిపోసి ఈ రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తారా? లేదా రిజర్వాయర్‌లో నీటిని నిల్వ ఉంచుతారా ?లేదా ? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉన్నది. అయితే, ఈ రిజర్వాయర్ ద్వారా మిషన్ భగీరథ పథకం ద్వారా ధర్మారం, వెల్గటూరు మండలాలకు నీటి సరఫరా జరుగుతున్నది.

డెలివరీ సిస్టర్న్‌ల వద్ద చేపల వేట

నంది మేడారంలోని నంది పంప్‌హౌస్ నీటి ఎత్తిపోతను ఆపి వేయటంతో మత్స్యకారులతో పాటు సమీప గ్రామాల ప్రజలు చేపల వేటకు దిగారు. స్థానిక మత్స్యకారులు డెలివరీ సిస్టర్న్‌ల వద్ద వలలు వేసి చేపలు పట్టుకున్నారు. కొందరు రిజర్వాయర్‌లోకి వెళ్లే లింక్ కాల్వలోకి చేపల వేట సాగించారు. మత్స్యకారులు చేపలు కిలోకు రూ.150 చొప్పున విక్రయించారు.

-ధర్మారం,మార్చి31

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

'ఈద్-ఉల్-ఫితర్'ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ మాసం సందర్భంగా నెలపాటు కొనసాగిన ఉపవాస దీక్షలను ఆదివారం సాయంత్రం ముగించారు. సోమవారం ఉదయమే కొత్త బట్టలు ధరించి, ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని 'ఈద్ ముబారక్' అంటూ పరస్పర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ముస్లింలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, రఘువీర్ సింగ్

ఆఫ్‌లైన్‌లోనూ రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరించాలి

వీసీలో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించిన డిప్యూటీ సీఎం

పెద్దపల్లి, మార్చి31: రాజీవ్ యువ వికాసం పథకానికి సర్వర్ పని చేయని పక్షంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసంపై సీఎస్ శాంతి కుమారితో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ పథకం మానిటరింగ్ కోసం ప్రత్యేకంగా ఓ ఐఏఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలని సీఎస్‌కు సూచించారు. వీసీలో కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 2018లో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ కింద దరఖాస్తు దరఖాస్తు చేసుకున్న కొందరికి యూనిట్ మంజూరైనప్పటికీ సబ్సిడీ విడుదల కాలేదని తెలిపారు. వారికి మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని వివరించారు. జిల్లాలో పాత దరఖాస్తుల స్వీకరణకు చేపట్టినందుకు పెద్దపల్లి కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. వీసీలో కలెక్టర్‌తో పాటు లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా బీసీ అభివృద్ధి రంగారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి రవి కుమార్, వినోద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో పకడ్బందీగా నిఘా

డ్రోన్ కెమెరా ఎగుర వేస్తున్న పోలీస్ అధికారులు

పెద్దపల్లి టౌన్, మార్చి31: పట్టణంలోని దేవాలయాలు, ఇతర ప్రార్థన మందిరాల వద్ద డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంటుందని డీసీపీ కరుణాకర్ తెలిపారు. సోమవారం రంజాన్ సందర్భంగా డీసీపీ కరుణాకర్ పెద్దపల్లిలోని ఈద్గాను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడారు. డ్రోన్ కెమెరాతో ఆర్డీవో కార్యాలయం సమీపంలోని పెద్ద మసీదు, చందపల్లి ఈద్గా, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, రంగంపల్లి కోర్టు, వేంటేశ్వరస్వామి దేవాలయం వద్ద డ్రోన్ కెమెరాతో నిఘాను పర్యవేక్షించారు. ఇక్కడ ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ బర్ల అనిల్‌కుమార్, ఎస్ఐలు లక్ష్మణరావు, మల్లేశ్, డ్రోన్ ఆపరేటర్ అనిల్‌కుమార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది ఉన్నారు.

వీహెచ్ఆర్ ఫౌండేషన్ సామాజిక సేవ

నగదు అందజేస్తున్న వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

ఫర్టిలైజర్‌సిటీ/కోల్‌సిటీ, మార్చి 31: వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టారు. గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రామగుండంలోని తబితా ఆశ్రమంలో జన్మదిన వేడుకలు, అన్నదానం, రెండో డివిజన్‌లో మానసిక పరిస్థితి సరిగా లేని యువకుడి కుటుంబానికి 50కిలోల బియ్యం పంపిణీ చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు అబ్బోజు రాంబాబు కుమారుడి చదువు నిమిత్తం రూ.30వేలు కళాశాల ఫీజును మాజీ ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య రాంరెడ్డి అందజేశారు. తిలక్‌నగర్‌కు చెందిన క్యాన్సర్ బాధితుడికి వైద్య ఖర్చులకు గాను రూ.7వేలు అందజేశారు. ఆర్‌సీవోఏ క్లబ్‌లో నిరుపేద కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వ దవాఖానలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ నాయకులు, వీహెచ్ఆర్ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

'సాయికుమార్‌ది కుట్రపూరిత హత్య'

పెద్దపల్లి టౌన్, మార్చి31: ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెళ్ల సాయికుమార్(20)ది కుట్రపూరిత హత్య అని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్ ఆరోపించారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు. సాయికుమార్‌ను హత్య చేసిన నిందితులకు, సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుట్రపూరిత హత్యపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులో న్యాయ విచారణ జరిపించాలని కోరారు. మృతుడి కుటుంబానికి రూ. కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు, ప్రజా ఫ్రంట్, ఫౌర హక్కుల సంఘం, దళిత లిబరేషన్ ఫ్రంట్ సంఘాలు ముప్పిరితోటకు వెళ్లి ఘటన వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ఇక్కడ నాయకులు శ్రీపతి రాజగోపాల్, గుమ్మడి కొమురయ్య, బాలసాని రాజయ్య, బొంకూరి లక్ష్మణ్, పుట్ట రాజన్న, రెడ్డిరాజుల సంపత్, సత్యనారాయణ ఉన్నారు.

రిటైర్డ్ అధికారికి సన్మానం

గోదావరిఖని, మార్చి 31: ఆర్జీ-1జిల్లా కార్యాలయం పర్సనల్ డిపార్టుమెంట్‌లో సీనియర్ పీవో బంగారు సారంగపాణి సోమవారం ఉద్యోగ విరమణ పొందగా ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ సన్మానించారు. ఇక్కడ ఎస్ఓటు జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజినీర్ డీవి రావు, సీఎంవోఐ ప్రతినిధి క్రాంతి, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో హన్మంతరావు, శ్రావణ్, అధికారులు కుమారస్వామి, ధనలక్ష్మీబాయి, సాయిప్రసాద్, వీరారెడ్డి ఉన్నారు.

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 31 : ఆర్జీ-2 ఏరియాలోని వకీలుపల్లి గనిలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన లింగయ్యను అధికారులు, ఉద్యోగులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. 3 కార్యక్రమంలో మేనేజర్ రవికిరణ్, గుర్తింపు సంఘం కార్యదర్శి జీ. రవీందర్, రక్షణాధికారి రాంకుమార్, డీవైపీఎం శ్యాంప్రసాద్, మామిడి మహేందర్, రాజులు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు రాక..

- బేగంపేట ఎక్స్‌రోడ్‌లో ప్రయాణికుల అగచాట్లు

బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రామగిరి, మార్చి 31 : మంథని బస్సు డిపో నుంచి సమయానికి బస్సులు రాకపోవడంతో మండంలోని బేగంపేట ఎక్స్‌రోడ్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తమకు అగచాట్లు తప్పడం లేదంటున్నారు. రామగిరి, ముత్తారం మండలాలకు చెందిన వారంత బేగంపేట ఎక్స్‌రోడ్ నుంచే పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. వేళకు బస్సులు రాకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. మంథని డిపోకు చెందిన ఆర్‌టీసీ అధికారులు దృష్టి సారించి నిర్ణీత సమయానికి బస్సులు నడుపాలని కోరుతున్నారు.

గ్రూప్స్‌లో ఖాన్‌సాయిపేట యువకుడి ప్రతిభ

అరుణ్ కుమార్

మంథని రూరల్, మార్చి 31: ఖాన్‌సాయిపేటకు చెందిన జక్కుల అరుణ్ కుమార్ ర్యాంకుల పరంపరను కొనసాగిస్తున్నాడు. తాజాగా గ్రూప్-1లో అరుణ్ కుమార్ రాష్ట్ర స్థాయిలో 114, మల్టీ జోన్-1 స్థాయిలో 64వ ర్యాంక్ సాధించాడు. 2018లో ట్రిపుల్ ఐటీ జబల్‌పూర్‌లో బీటెక్(సీఈసీ) పూర్తి చేశాడు. అప్పటి నుంచి హైదరాబాద్, ఢిల్లీలో ఉంటూ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. మూడు సార్లు సివిల్స్‌కు అటెంప్ట్ చేశాడు. 2022లో గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో అప్పటి నుంచి ప్రిపేర్ అయ్యాడు. గ్రూప్-2లో రాష్ట్ర స్థాయిలో 35వ ర్యాంక్, గ్రూప్-3 లో రాష్ట్ర స్థాయిలో 81వ ర్యాంక్ సాధించాడు. అరుణ్ కుమార్ తండ్రి లక్ష్మీనారాయణ కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తుండగా, తల్లి మల్లేశ్వరి మంథని మండలం భట్టుపల్లిలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. అరుణ్ కుమార్ గ్రూప్స్‌లో సత్తా చాటడం పట్ల తల్లిదండ్రులు బంధువులు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

సాయం అందజేత

ఓదెల, మార్చి 31: తోటి మిత్రుడు అకాల మరణం చెందడంతో ఆ కుటుంబానికి సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు మిత్రులు. ఓదెలకు చెందిన రాచర్ల శంకర్ అనారోగ్యంతో బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందాడు. అతనికి చిన్న పిల్లలు ఉన్నారు. దీంతో మిత్ర బృందం రూ.20వేలు పోగు చేసి సోమవారం కుటుంబీకుల అందజేశారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీ బోడకుంట చినస్వామి, మిత్రులు అల్లం సతీశ్, దాసరి కోటి, గుర్రాల శ్రీధర్, శ్రావణ్, మధు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

సుల్తానాబాద్‌రూరల్,మార్చి31: కాట్నపల్లి శివారులోని ఓ ఇండస్ట్రీస్‌లో ఎస్ఐ శ్రావణ్ కుమార్ సోమవారం తన సిబ్బందితో కలిసి తనిఖీలను నిర్వహించి, గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. మండల వ్యవసాయాధికారి డేవిడ్‌రాజ్ వాటిని గంజాయి మొక్కలుగా గుర్తించారు. మొత్తం మూడు పెద్ద గంజాయి మొక్కలు, రెండు చిన్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వివరించారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

కోల్‌సిటీ, మార్చి 31: గంగానగర్ నుంచి రామగుండం వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, లేనిపక్షంలో టోల్ గేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ హెచ్చరించారు. గోదావరిఖని జీఎం ఆఫీస్ టర్నింగ్ వద్ద ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా ప్రజాప్రతినిధులకు బాధ్యత లేకుండా ఉలుకు పలుకు లేకుండా వ్యవహరించడం శోచనీయమని పేర్కొన్నారు. సోమవారం జీఎం ఆఫీస్ మూలమలుపు వద్ద జరిగిన ప్రమాద స్థలాన్ని సీపీఐ నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్‌లతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ అధికారులు, హెచ్‌కేఆర్ అధికారులు తమకు రాబడి వచ్చే పనులపైనే దృష్టి పెడుతున్నారే తప్ప ప్రజల ప్రాణాలకు విలువ ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లైవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. ఇక్కడ నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదమ్మ, రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో రికార్డ్ స్థాయిలో బొగ్గు రవాణా

- ఒకే రోజు ఎన్టీపీసీకి 31వేల టన్నుల బొగ్గు సరఫరా
- జీఎంను అభినందించిన సింగరేణి సీఎండీ

రామగిరి, మార్చి 31: సింగరేణి ఆర్జీ-3 సీహెచ్‌పీలో రికార్డు స్థాయి బొగ్గు రవాణా జరిగింది. ఆదివారం ఒక్కరోజే ఎన్టీపీసీ సంస్థకు 31వేల టన్నుల బొగ్గు సరఫరా చేసింది. ఈమేరకు సీహెచ్‌పీ ఉద్యోగులను, ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావులను సంస్థ సీఅండ్ ఎండీ బలరాం నాయక్ ప్రత్యేకంగా అభినందించారు. 2024-25 సంవత్సరంలో ఈ సీహెచ్‌పీ ద్వారా ఒక్కరోజులోనే ఉగాది రోజున 15 రైల్వే రేకుల ద్వారా ఎన్టీపీసీ సంస్థకు 30,839 టన్నుల బొగ్గు రవాణా చేయడమే కాకుండా రోడ్డు మార్గం ద్వారా మరో 200 టన్నుల బొగ్గును రవాణా చేసి మొత్తం ఆర్జీ-3 నుంచి 31,039 టన్నుల బొగ్గు రవాణా చేసేందుకు కృషి చేసిన అధికారులను, ఉద్యోగులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ఉద్యోగులు కలిసికట్టుగా పని చేస్తూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని కోరారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కోల్‌సిటీ, మార్చి 31: నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సోమవాం సమీక్ష జరిపారు. రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై సమీక్ష చేసి మాట్లాడారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా తాను చూసుకుంటానని పనుల్లో వేగం పెంచాలని అధికారులు సూచించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, సింగరేణి ఆర్జీ-1 జీఎం లలితకుమార్, ఆర్ఎఫ్‌సీఎల్ డీజీఎం రమేశ్ ఠాకూర్, సీనియర్ మేనేజర్ వెంకటరెడ్డి, సింగరేణి ఎస్ఈ వరప్రసాద్, వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

బోల్తాపడిన బూడిద ట్యాంకర్

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 31: గోదావరిఖని జీఎం కాలనీ రాజీవ్ రహదారిపై సోమవారం బూడిద లారీ ట్యాంకర్ బోల్తాపడింది. ఎన్టీపీసీ నుంచి మంచిర్యాల్ వైపు వెళ్తుండగా మూలమలుపు వద్ద ట్యాంకర్ ఆదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాం కర్ డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. ఈ మూలమలుపు వద్ద వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మరమ్మతు పనులు చేపట్టినా ప్రమాదాలు ఆగడం లేదు. ప్రమాద స్థలి వద్ద సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో తరుచూ ఇక్కడే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాల్వశ్రీరాంపూర్, మార్చి31: హుస్సేన్‌మియా వాగులో ఇసుక తోడుతున్న జేసీబీతో పాటు, ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని ఠాణాకు తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా చిన్నరాత్‌పల్లి హుస్సేన్‌మియా వాగులో రాత్రిపూట జేసీబీ తో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

గంగారం పరిధిలోని ఊషన్నపల్లె లో కారు బైక్‌ను ఢీకొట్టడంతో లక్ష్మీపురం గ్రామానికి చెందిన బండ మల్లారెడ్డి అనే రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. మల్లారెడ్డి తన బైక్‌పై ఊషన్నపల్లె నుం,ఇ లక్ష్మీపురం వెళ్తుండగా గ్రామ శివారులో పెద్దంపేటకు చెందిన కారు అతివేగంగా వచ్చి ఎదురుగా ఢీకొట్టింది. దీంతో మల్లారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు.

విజయవంతం చేయండి

కమాన్‌పూర్, మార్చి 31: దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, తెలంగాణ రాష్ట్రం లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయా లనే డిమాండ్‌తో ఈనెల 2న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట బీసీల పోరు గర్జన వాల్ పోస్టర్, కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. మండల ఉపాధ్యక్షుడు తోట రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీలం శ్రీనివాస్, పోలుదాసరి సాయి కుమార్, దేవునూరి చంద్రమౌళి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాస రవి, గుర్రాల చంద్రమౌళి, జంగపెల్లి చిన్న శ్రీనివాస్, సుంచు శ్రీనివాస్, నర్సింగం, కొండపాక శంకర్, చిదురాల సదయ్య, అనిల్ గౌడ్, దీకొండ రమేశ్, దాసరి రామ స్వామి, దాసరి రామ చంద్రం, కూనమల్ల రాజనర్సు, మట్ట రాజయ్య పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ కుటుంబానికి సాయం

పెద్దపల్లి, మార్చి31: కేబుల్ ఆపరేటర్ శంకర్ కుటుంబానికి పెద్దపల్లి పట్టణ, గ్రామీణ కేబుట్ ఆపరేటర్ ఆధ్వర్యంలో రూ. 85వేలు అందజేశారు. శంకర్ ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు సోమ వారం మృతుడి నివాసంలో కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. అంతకు ముందు శంకర్ చిత్రపటా నికి పూల మాల వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు లైశెట్టి భిక్షపతి, కేబుల్ ఆపరేటర్లు కత్తెర్ల తిరుపతి యాదవ్, ముద్దసాని సమ్మయ్య, తిర్రి తిరుపతి గౌడ్, కొల్లూరి అశోక్, రాంబాబు, పీ గోపి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Wanted Sales Executives @ Karimnagar, Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals. Ph: 9573244611, raju@unicchem.com
NT-330931
డాక్యుమెంట్స్ పోయిన